ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమానికి ప్రజలు మద్దతివ్వాలి

» డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ కలిసి ఓటు చోరీకి పాల్పడ్డారని ఆధారాలతో బయటపెట్టిన ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మంజులాపూర్ రోడ్డులోని హోటల్ మారుతిఇన్‌లో నేడు ఓటుచోరీపై పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ చూపబడుతుందని తెలిపారు.

ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు

ఓటు చోరీ ఉద్యమంలో భాగంగా ఉద్యమిస్తున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా నేత కొట్టె శేఖర్ ప్రకటనలో తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో ఓటరు జాబితాల్లో చోటు చేసుకున్న అనేక అవకతవకలను బహిరంగపరిచి, ఓటర్ల జాబితాను డిజిటల్ జాబితాగా రూపొద్దిదాలని కోరుతున్న రాహుల్ గాంధీని అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌ల కేటాయింపులో అనర్హులను తొలగించాలి

ఖానాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొమరం భీమ్ చౌరస్తాలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్లను పంపిణీ చేయాలని నర్వాడే గ్లోబల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేష్, మండల అధ్యక్షుడు మూలంకల మురళి డిమాండ్ చేశారు. సోమవారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గత కొద్ది రోజుల క్రితం చేపట్టిన విచారణను మధ్యంతరంగా ఎందుకు నిలిపి వేశారన్నారు. ఇప్పటికైనా వెంటనే విచారణ పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంగం జిల్లా సహాయ కార్యదర్శి బోడ గణేష్, మండల ఉపాధ్యక్షుడు కొల్లెం రమేష్, తదితరులు ఉన్నారు.

» జిల్లాలో 13 ఇసుక రీచుల గుర్తింపు
» జిల్లాకు మంజూరైనవి 8286 ఇళ్లు
» పది ఇళ్లు కూడా పూర్తి కాని వైనం
» ఆటంకమవుతున్న సిమెంట్, స్టీల్ ధరల పెంపు
» అటవీ శాఖ, వీడీసీలతో ఇబ్బందులు



ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ముఖ్యంగా సిమెంట్, స్టీల్ ధరలు పెరగడంతో పాటు ఇసుకకు సైతం ఇబ్బందులు తలెత్తుతుండడంతో నిర్మాణాలకు ఆటంకమవుతోంది.

నిర్మల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గత కొద్దిరోజుల క్రితం ఇందిరమ్మ ఇళ్ల కోసం అవసరమయ్యే ఇసుక రీచులను వాగులు, గోదావరి నది వద్ద గుర్తించింది. ఇక్కడినుంచి ఇసుకను లబ్ధిదారులకు తరలించు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. అయితే ఖానాపూర్ మండలం ఎర్వచింతల వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అటవీశాఖ అధికారులు ఆటంకాలు చెబుతున్నారు. కవ్వాల్ ఫారెస్ట్ రిజర్వ్ పేరుతో ఫారెస్ట్ అధికారులు ఇసుక తవ్వకాలు, రవాణాను అడ్డుకుంటుండడంతో నాలుగైదు మండలాలకు ఇసుక సరఫరా ఆగిపోయింది. అలాగే మరికొన్ని చోట్ల అక్కడి వీడీసీలు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక తరలింపును అడ్డుకుంటుండడం సమస్యగా మారింది. వీటితోపాటు ఇప్పటివరకు నిర్మించిన ఇండ్లకు బిల్లులు రాకపోవడంతో కొత్త ఇళ్ల నిర్మాణ పనులు మొదలుకావడం లేదని అంటున్నారు. మొత్తం ఇందిరమ్మ ఇళ్ల కోసం 2లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక అవసరమవుతుందని భావించి దానికి అనుగుణంగా ఆయా మండలాల సమీప ప్రాంతాల్లోని వాగులతో పాటు గోదావరి నదిలో ఇసుక రీచులను గుర్తించారు. లబ్ధిదారులు ఈ రీచుల నుంచి ఇసుకను తరలించుపోవాల్సి ఉంది. గనుల శాఖ, రెవెన్యూ శాఖలు సమన్వయంగా ఇసుక తరలింపును పర్యవేక్షించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో 420 ఇండ్లను బెస్‌మెంట్ లెవల్ వరకు నిర్మించగా మరో 61 ఇండ్లను గోడల లెవల్ వరకు పూర్తి చేశారు. అయితే చేసిన పనులకు బిల్లులు సకాలంలో అందకపోతుండడంతో లబ్ధిదారులు మిగతా పనులను పూర్తి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

జిల్లాకు 8286 ఇళ్ల మంజూరు

జిల్లాలో మొత్తం 1,92,233 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఇందులో నుంచి అధికారులు స్క్రూటీని చేసి చాలా మందిని తొలగించారు. కాగా ప్రభుత్వం మాత్రం ఈ లెక్కలను పట్టించుకోకుండా జిల్లాకు కేవలం 8286 ఇండ్లను మాత్రమే మంజూరు చేసింది. అయితే ఇందులో నుంచి ఇప్పటి వరకు 4878 మంది ఇండ్ల నిర్మాణాలకు ముగ్గు పోసినప్పటికి ఇప్పటి వరకు ఒక్క ఇళ్ళు కూడా స్లాబ్ లెవల్ వరకు పూర్తికాకపోవడం భిన్నాభిప్రాయాలకు కారణమవుతోంది. కేవలం పది ఇండ్లు మాత్రమే స్లాబ్ లెవల్‌లో ఉండగా 61 ఇండ్లు మాత్రం గోడల లెవల్‌లో ఉన్నాయి. వీటితో పాటు 420 ఇండ్లు కేవలం బెస్‌మెంట్ లెవల్‌కే పరిమితమైపోయాయి. అన్ని చోట్ల నిర్మాణ పనులు నత్తనడకనను తలపిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇసుక సమీప ప్రాంతంలో అందుబాటులో లేకపోవడం, సిమెంట్, స్టీల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు ప్ర భుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయని కారణంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను మొదలుపెట్టేందుకు జంకుతున్నారు.

ఫారెస్ట్, వీడీసీల అడ్డగింత

కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని ఎర్వచింతల్ వద్ద గల లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్ తదితర మండలాలకు కేటాయించబడ్డ ఎర్వచింతల చిక్‌మాన్ వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ వాగు పరివాహకమంతా టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉన్న కారణంగా ఇక్కడి నుంచి ఇసుకను తరలించడం అటవీ శాఖ నిబంధనల ప్రకారం నేరమంటూ ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అలాగే నిర్మల్ ప్రాంతంలోని మరికొన్ని గ్రామాల్లో వీడీసీలు తమ సమీప ప్రాంతాల్లోని వాగుల నుంచి ఇసుకను తరలించకుండా అడ్డుకుంటున్నాయంటున్నారు. ఇప్పటికే వీడీసీలు ఇసుక రీచులను తమ గుప్పిట్లోకి తీసుకొని అనధికారిక వేలం పాటలు నిర్వహించాయి. ఇలా వేలం పాటల ద్వారా పెద్దమొత్తంలో డబ్బులు కూడగట్టుకుంటున్నాయన్న ఫిర్యాదులున్నాయి. ఇటు ఫారెస్ట్ అధికారులు అటు వీడీసీల కారణంగా ఇసుక తరలింపుకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయంటున్నారు.

రెండు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం

నిర్మల్ జిల్లాలో 8286 ఇళ్లను నిర్మించేందుకు 2,275 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని అధికారులు గుర్తించారు. దీని కోసం గానూ భైంసా, కుబీర్, కుంటాల, లోకేశ్వరం, ముథోల్, తానూర్, నర్సాపూర్(జి) మండలాలకు సమీప సుద్దవాగు పరివాహకంలో ఇసుక రీచులను గుర్తించారు. ఈ మండలాలకు సాద్గాం, మన్మద్, ముత్కపెల్లిల నుంచి ఇసుకను తరలించేందుకు అధికారులు నిర్ణయించారు. అలాగే నిర్మల్ మున్సిపాలిటీతో నిర్మల్, సోన్, సారంగాపూర్ మండలాలకు వెంగ్వాపేట్, బీరవెల్లిల గుండా ప్రవహించే స్వర్ణ వాగులో ఇసుక రీచులను గుర్తించారు. అయితే ఈ వాగుల వద్ద కూడా లభ్యత అయ్యే ఇసుక ఆధారంగా కేటాయింపులు జరిపారు. బీరవెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలింపును అక్కడి వీడీసీలు అడ్డుకుంటుండడం వివాదాస్పదమవుతోంది.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఆర్జీయూకేటీ, మెటా గేట్ సంస్థ అధికారులు

ఆర్జీయూకేటీ, మెటా గేట్ మధ్య ఒప్పందం

» విద్యార్థులకు గేట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

బాసర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీలోని మెటలర్జీ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మెటా గేట్ అకాడమీల మధ్య అవగాహన ఒప్పందం సోమవారం కుదిరింది. ఈ ఒప్పందంపై ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ సమక్షంలో ఓయస్‌డీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ మురళీదర్శన్, మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ గురుప్రసాద్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా గేట్ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు గొప్ప తోడ్పాటు అవుతాయని పేర్కొన్నారు. మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ గురుప్రసాద్ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ విద్యార్థుల్లో ఎక్కువ శాతం ప్రతిభావంతులు పేద కుటుంబాల నుంచి వస్తున్నారని అన్నారు. వారి ఆర్థిక పరమైన అడ్డంకులను తొలగించి, సామాజిక దృక్పథంతో సహాయం చేయాలనేదే తమ సంకల్పం అన్నారు. ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు గేట్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణను అందించడానికిముందుకు వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డాక్టర్ మహేష్, డాక్టర్ విఠల్, అధ్యాపకులు, డాక్టర్ ఆర్. అజయ్, వి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యావిధానాన్ని సద్వినియోగం చేసుకోండి

బాసర, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ విద్యావిధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వనరులు, ఉత్త విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు అకాడమిక్ జ్ఞానం మాత్రమే కాకుండా సమగ్రత వ్యక్తిత్వ వికాసం సాధించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ప్రోత్సహించాలని, బలవంత, ఒత్తిడి చేయవద్దని సూచించారు. తమ మాటలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డా.నాగరాజు, మహేష్, విఠల్, చీఫ్ వార్డెన్ మధుసుదన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

ప్రజలకు పోలీస్ సేవలు చేరువ చేయడమే లక్ష్యం

» ఎస్పీ జానకీ షర్మిల



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి పిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదుదారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.



ఎన్‌సీసీ కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న దృశ్యం

సామాజిక సేవలో ఎన్‌సీసీ కేడెట్ల పాత్ర అభినందనీయం

» ఆదిలాబాద్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ అరవింద్ కిచార్

నిర్మల్‌టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కేడెట్లు నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమని, వారి సేవలు భవిష్యత్తులో దేశరక్షణకు కూడా మరింతగా ఉపయోగపడతాయని ఆదిలాబాద్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ అరవింద్ కిచార్ పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్‌లో ఆయన ఎన్‌సీసీ కేడెట్ల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఇక్కడి ఎన్‌సీసీ వింగ్ ఆఫీసును పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో ఎన్‌సీసీ కేడెట్లు విశిష్టమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. అనేక సమయాల్లో వారు సాహసోపేతంగా అందిస్తున్న సేవలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతున్నాయన్నారు. భవిష్యత్తులో వారి సేవలు మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లం రవిబాబు, ఎన్‌సీసీ వింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా నమోదు చేసుకోండి

ముథోల్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి అర్హులైన కొత్త రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ముథోల్ మండల వ్యవసాయ అధికారి రచన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అర్హులైన రైతులు ఈనెల 13లోపు నమోదు చేసుకోవాలని కోరారు. రైతే స్వయంగా దరఖాస్తు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు పారం నింపి, ఆధార్ కార్డు, రైతు భూమి పాస్ పుస్తకం జిరాక్స్, నామిని ఆధార్ జిరాక్స్‌తో వచ్చి ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

కుంటాల, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. సోమవారం శ్రావణ మాసం పురస్కరించుకొని సూర్యాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముథోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, గ్రామాలల్లో దేవాదాయ శాఖ నిధులతో పురాతన ఆలయాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అనంతరం అర్చన, అభిషేకం, హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పని చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను వెంట వెంటనే అప్డేట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు వేగవంతంగా పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన , గ్రామీణ్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులంతా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలులోకి వచ్చిన ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నైజింగ్ హాజరు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలకు తనిఖీలకు వెళ్లినప్పుడు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు

లక్ష్మణచాంద, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాపూర్‌లో గల అక్షర హైస్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై నషా ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఏ.శ్రీనివాస్ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాలు వాడడంతో ఆరోగ్యంపై పడే దుష్ప్రభావం, వ్యాధుల సంక్రమణ తదితరాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం వలన చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనారోగ్యంతోపాటు పోలీస్ కేసులు నమోదు అవుతాయని తద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో విదేశాలకు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అక్షరహైస్కూల్ ప్రిన్సిపాల్ సునంద పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

వ్యక్తిగత శుచి, శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఆకాష్



మాత్రలను వేస్తున్న జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా,ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత శుచి, శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని భైంసా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఆకాష్ పేర్కొన్నారు. సోమవారం భైంసాలో బాలికల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన నులిపురుగు నివారణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వానకాలం సీజన్‌లోని వ్యాధులు, వాటి నివారణ చర్యలు, వ్యాధులబారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఇదేక్రమంలో ప్రతీ విద్యార్థి ఆరోగ్య రక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు వివరించారు. నులిపురుగుల వలన కలిగే ఆరోగ్య సమస్యలను తెలియచెప్పి వాటి నివారణకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. ఇందులోపాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

నిర్మల్ రూరల్: సోమవారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల వెంకటాపూర్‌లో జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి మూడారపు పరమేశ్వర్ పంపిణీచేశారు. పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రమోద్‌రావు, ఏఎన్‌ఎం పి. లక్ష్మీబాబు, ఆశా కార్యకర్తలు సుధా, రాధా, సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

భైంసారూరల్: సుంక్లీ గ్రామంలో చిన్నారులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అల్బెండజోల్ మాత్రలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-19ఏళ్ల పిల్లలకు తప్పనిసరిగా మాత్రలను వేయించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీ పిల్లాడికి మాత్రలు వేసేలా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఆకాష్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మండల విద్యాధికారి సుభాష్, సీడీపీవో రాజశ్రీ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమణరావు, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు సోలంకి భీమ్‌రావు, తదితరులు ఉన్నారు.



గొర్రెలకు టీకాలు వేస్తున్న దృశ్యం

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ముథోల్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లో సోమవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో జీవాలకు బ్లూటంగ్ వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డా.సురేష్ మాట్లాడుతూ గొర్రెలు, ఇతర గడ్డి తినే జంతువులను రక్షించడానికి బ్లూటంగ్ టీకాలు ఉపయోగిస్తారన్నారు. వ్యాధి నివారణకు టీకాలు ఉత్తమ మార్గం అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు.

సంఘ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని వినతి

తానూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరి(బీ) గ్రామ నాయక్‌పోడ్ కులస్తులు సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కులసంఘ భవన నిర్మాణానికి నిధులను కేటాయించాలని మాజీ ఎమ్మెల్యేను కోరినట్లుగా తెలిపారు. దీంతో సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి కృష్ణరావు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో కులసంఘం సభ్యుల బొడ్డోళ్ల నాగన్న, గడ్డం గణేష్, ఉండెపోడ్ లక్ష్మణ్, భూమన్న, బండ్రోళ్ల గంగాదర్, దొంతుల రమేష్, సుభాష్, పోతన్న, తమ్మల పోతన్న, ఉండెపోడ్ గంగాధర్, సాయినాథ్, ఉన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ విరాళం

దస్తురాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు మండలంలోని విశ్రాంత ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు రూ.50 వేల రూపాయల మైక్ సెట్‌ను విరాళంగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఈ మైక్ సెట్ ఉపయుక్తమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగాధర్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు షరీన్, రవీందర్, శ్రీనివాస్, సత్తన్న ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

భైంసా, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పర్వదిన వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో పట్టణ పరిధిలో నెలకొన్న అంతర్గత, ప్రధాన ప్రాంతాల రోడ్లు, వీధి లైట్ల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని భైంసా టౌన్ బీజేపీ కమిటీ మున్సిపల్ అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంబంధిత విషయంలో సోమవారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో పట్టణ బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల రాము, దగడే శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మున్సిపల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందచేసి విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా బీజేపీ ప్రతినిధులు రావుల రాము దగడే శ్రీకాంత్ , రావుల పోశెట్టి న్యామత్‌వార్ లింగోజీ, ముల్లావార్ అనిల్‌లు మాట్లాడుతూ మిషన్ భగీరథ పైప్‌లైన్ల ఏర్పాటు మూలంగా పట్టణ పరిధిలోని అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయని తెలిపారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలతో సైతం పలు ప్రాంతాల్లోని రోడ్లు దెబ్బతిని, గుంతలమయమయ్యి రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. పట్టణ పరిధిలోని ఆయా వార్డుల బీజేపీ ప్రతినిధులు మన్మోహన్ పాటిల్, సీహెచ్ వెంకటేష్, చెర్ల సుభాష్, కార్తీక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి.. ఇరుక్కుపోయి

● ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం నుంచి కైలాష్ నగర్ వరకు ఓ మహిళకు లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తిని బెదిరింపులకు గురి చేసి డబ్బులు వసూలు చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న పట్టణానికి చెందిన వెష్కర్ రవికుమార్ గత నెల 21వ తేదీన ఓ మహిళకు లిఫ్ట్ ఇచ్చి గమ్యస్థానానికి చేర్చగా..సదరు మహిళ ఆయన నంబర్ తీసుకుంది. రెండు రోజుల తర్వాత వాఘాపూర్ గ్రామానికి చెందిన చాకటి కిరణ్.. రవికుమార్ మొబైల్ కు ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు.తన మరదలును వేధిస్తున్నారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించి రూ.50వేల డబ్బులు డిమాండ్ చేశాడు. భయపడ్డ రవికుమార్..తన వాహనాన్ని తాకట్టు పెట్టి రూ.30 వేలు ఇచ్చాడు.అనంతరం తనకుటుంబ సభ్యులకు విషయాన్ని తెలపడంతో రిటైర్డ్ ఎస్సైఅయిన తండ్రి లక్ష్మణ్ వెంటనే పోలీసులకు సమా చారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చాకటి కిరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. మహిళను వేధించా వంటూ ఆరోపణలు చేసి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించామని, బెదిరింపులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ఉట్నూర్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని గోపాయిచెరువులో ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి చందు (14) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉట్నూర్ పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సురేష్‌కుమారుడు చందు(14) తోటి స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం చెరువులో ఈత కొడుతు చెరువులో మునిగి పోగా స్నేహితులు ఎవరికి చెప్పకుండా ఇండ్లకు వెళ్లిపోయారు. తండ్రి సురేష్ ఇంటికి కొడుకురాక పోవడంతో రాత్రి గాలించడంతో పాటు తెలిసిన బంధువులకు ఫోన్లు చేసి విచారించారు. తమ వద్దకురాలేదని తెలపడంతో ఉదయం వస్తాడని ఎదురుచూస్తూ ఉండగా సోమవారం మధ్యాహ్నం గోపాయిచెరువులో విద్యార్థి శవం తేలడంతో కుటుంబ సభ్యులు నిర్ఘాంత పోయారు. సురేష్‌కు ముగ్గురు కొడుకులు కాగా మృతి చెందిన చందు రెండవ కుమారుడు. ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామ నిర్వహించిన అనంతరం పోస్టుమార్టంకోసం శవాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

● వ్యక్తి 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.12 వేలు జరిమానా

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తికి 2సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.12 వేల జరిమానా విధిస్తు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పును వెలువరిచినట్లు కోర్టు లైజన్ అధికారిరాఘవేందర్ తెలిపారు. తీర్పుకు సంబందించిన వివరాలను వెల్లడించారు.మండలంలోని ఒక గ్రామా నికి చెందిన బాధితురాలిని సింగరేణిలో పని చేస్తున్న ఎదుమారి సుధాకర్ 2018 నుంచి పెండ్లి చేసుకుంటానని ప్రేమపేరుతో పరిచయం పెంచుకున్నాడు. ఈవిషయం బాధితురాలు తనతల్లిదండ్రులకు చెప్పింది.ఈవిషయంలో సుధాకర్‌నుపిలిచి విచారించారు.తన తల్లిదండ్రులను ఒప్పించి పెండ్లి చేసుకుంటనని బాధితురాలి తల్లిదండ్రులను నమ్మించాడు. కొద్ది రోజుల తర్వాత మరో అమ్మాయితో పెండ్లి కుదిర్చినట్లు తెలిసిన వెంటనే బాధితురాలు సుధాకర్‌ను నిలదీయగా.. ఆయనఒప్పుకోలేదు. దీంతో 20 డిసెంబర్ 2020న ఫిర్యాదు చేశారు. పోలీసులు చార్జీషిట్ దాఖలు చేయగా పీపీ ముస్కు రమణరెడ్డి 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ప్రత్యేక న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పును వెలువరించారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

ఉట్నూర్,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులో ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ ప్రయాణికురాలు పర్సు పోగొట్టుకోవడంతో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది మహిళ ప్రయాణికురాలికి సోమవారం పర్సు అప్పగించారు.ఆర్టీసీ కండక్టర్ రమణ నిజాయితిని ఆర్టీసీ అధికారులు మెచ్చుకుని అభినందించారు.

లైన్ ఎల్‌సీ మొబైల్ యాప్‌లోనే తీసుకోవాలి

నిర్మల్‌రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ ప్రతీఒక్కరు లైన్ ఎల్‌సీ మొబైల్‌యాప్‌లోనే తీసుకోవాలని డైరెక్టర్ ఆపరేషన్ టి. మధుసూదన్ అన్నారు.సోమవారం జిల్లా విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడుతూ... అగ్రికల్చర్ వర్క్స్ తొందరగా పూర్తి చేసి సర్వీస్‌లు రిలీజ్ చేయాలని, 33 కేవీ, 11 కేవీ లైన్లు సబ్ స్టేషన్ మరమ్మతులు వెంటనే చేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లూజు లైన్లు,పోల్స్ తక్కువ ఎత్తులో ఉన్న నియంతికలను వెంటనే గుర్తించి సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

సద్గురువులు చూపిన సన్మార్గంలో నడుచుకోవాలి

● విజయ డైరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి

తలమడుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సద్గురువులు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. మండలంలోని కజర్ల గ్రామంలో నిర్వహిస్తున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో శబరిమాత భక్తులు, మాజీ మున్సిపల్ కమిషనర్ చింతలపల్లి దేవా రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటమ్మ, కిరణ్ ఎంపీటీసీ స్వామి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, అగ్గిమల్ల గంగన్న, గోదావరి కమలాకర్, జై భారత్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

తలమడుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ ఎవరు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం వారికి పథకాలు అందించేందుకు ప్రభుత్వం జారీ చేస్తున్న ఆహార భద్రత కార్డు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. కార్డు పంపిణీకి చివరి తేదీ ఏమీ లేదని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ విచారణ చేపట్టి రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డుల కోసం మధ్యవర్తులను దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కుల ధృవీకరణ పత్రాలు, ఇన్కమ్ సర్టిఫికెట్లను అందిస్తున్నామని పేర్కొన్నారు.

గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా



గిరిజనుల సమస్యలు వింటున్న పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): గిరిజన దర్బార్‌కు వస్తున్న అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని ప్రాజెక్టుఅధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.బేల నుంచి హరిత బీఎడ్ మరియు టెట్‌పాస్ అయిఉన్నానని సీఆర్టీ ఉద్యోగం కావాలని అర్జీ సమర్పించారు. ఇంద్రవెల్లి మండలం జాలంతండాకు చెందిన కుమ్మరి రేణుక ఏఎన్‌ఎం చేసి ఉన్నానని ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం కల్పించాలని, గాదిగూడ మండలంలోని ఝరి గ్రామానికి చెందిన కుడిమెత అశ్విని గురుకులంలో సీటు కావాలని, ఆత్రం భగవంతురావు తనకు ఎటువంటి ఉపాధి లేదని ఏదైనా ఆశ్రమ పాఠశాలలో వాచ్‌మెన్‌గా ఉద్యోగం కల్పించాలని, ఇంద్రవెల్లి మండలం మర్కగూడకు చెందిన కుంరసంగీత తమ గ్రామంలో ఆశావర్కర్‌గా ఉద్యోగం ఇప్పించాలని, సిర్పూర్‌యూ మండలం కొమ్ముగూడ గ్రామానికి చెందిన ఒకరు రూ.10లక్షల రుణం ఇప్పించాలని,సిర్పూర్ యూకు చెందిన సాయికిరణ్ ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం కావాలని, కడెం మండలం ధర్మాజి పేటకు చెందిన మౌనిక తనకు సొంత ఇళ్లు లేదని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ఆత్రం విజయలక్ష్మి జీఏన్‌ఎం చేసి ఉన్నానని ఏదైనా ఆశ్రమాలలో ఉద్యోగం కల్పించాలని కోరుతూ అర్జీలు గిరిజనులు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీపీ ఇన్‌చార్జీ డీఎం గుడిమల్ల సందీప్‌కుమార్, డీడీ కార్యాలయం సూపరింటెండెంట్ వేణుమాదవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాల ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే



మహిళ సమైఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

ఇచ్చోడ, ఆగస్టు, 11 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండలంలోని కామగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళ సమైఖ్య భవనాన్ని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలోనే మహిళకు అన్ని విధాలుగా అభివృద్ధి జరిగిందన్నారు. ముఖ్యమంత్రి దత్తత జిల్లా ఆదిలాబాద్ జిల్లాకు చిన్నచూపు చూడవద్దని, ఆదిలాబాద్ జిల్లాకు మహిళ సంఘాలకు వడ్డీలేని రణాలు 8 కోట్లు అందిస్తే పక్క జిల్లా నిర్మల్‌కు 22కోట్లు అందించడం సమంజసం కాదని అన్నారు. మహిళ సంఘాలకు వడ్డీలేని ఒణాలు అందజేసి వారి కోసం సమైఖ్య భవనాలను అందజేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగు కృష్ణారెడ్డి, మాజీఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద గల ఆలయంలో సోమవారం జరిగిన శివాంజనేయ నూతన నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంతో పాటు జాతీయ రహదారిని అనుకుని ఉన్నా ఆలయం చాలా ఆహ్లాదంగా ఉందన్నారు. అలయానికి ప్రతి నిత్యం భక్తులు వచ్చి పూజలు చేయాలని కోరారు. ఆయన వెంట నేరడిగొండ. ఇచ్చోడా మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్. ప్రీతం రెడ్డి. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలి



విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

దిలావర్‌పూర్/లక్ష్మణచాంద/ఇంద్రవెల్లి/బోథ్/కుంటాల,ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి):ఆల్బెండజోల్ మాత్రలు 1-19 సంవత్సరాల వయస్సున్న ప్రతీ ఒక్కరు వేసుకోవాలని మండల వైద్యాధికారి డా. ప్రియాంక అన్నారు. సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అల్బెండజోల్ మాత్రలను వేసే కార్యక్రమాన్ని వైద్యాధికారి డా. ప్రియాంక ప్రారంభించారు. ఈ మాత్రలను 1-19 సంవత్సరాల వయస్సున్న ప్రతీ ఒక్కరికి వేయడం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ సెంటర్లలో వీటిని తప్పనిసరిగా వేయాలని సిబ్బందికి సూచించారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల విద్యార్థులకు నులి పురుగులు నశించి, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. బుద్ధి మాంద్యం తొలగి, ఆరోగ్యవంతముగా ఉంటారని ఆమె అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మనం భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానంద్, మండల పంచాయతీ అధికారి గోవర్ధన్, సీహెచ్‌వో రాజేశ్వర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న దేవి, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం పుష్ప, ఆశాలు విజయలక్ష్మి, విజయ ఉన్నారు. **లక్ష్మణచాందలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటెల శ్రీనివాస్ సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు ప్రత్యూష, కస్తూర్బా ప్రత్యేక అధికారి నవిత, మాజీ జడ్పీటీసీ ఓన రాజేశ్వర్, బిట్లింగ్ రజినీకాంత్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.** ఇంద్రవెల్లిలోనులిపురుగులను నివారిద్దామని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం పిలుపునిచ్చారు.శారీరక, మానసిక అభివృద్ధి మందగిస్తుంద న్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్‌రావు, డాక్టర్ పూజిత, హెల్త్ సూపర్‌వైజర్ పవార్‌సురేష్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. బోథ్‌లోనులి పురుగుల వల్ల చిన్నారుల్లో అనేక రకాల వ్యాధులు సోకుతాయని ప్రతి విద్యార్థి నులి పురుగుల నివారణకు ఆల్బెండజోలు మాత్రలను వినియోగించాలని డాక్టర్ నవీన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్‌ఎం పావని, ఆశా వర్కర్లు పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ వలిత తదితరులు పాల్గొన్నారు.కుంటాల మండల కేంద్రం కుంటాల స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శృతి పాల్గొని నులిపురుగు మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాథోడ్ సురేష్, అధ్యాపకులు బండారి గజేందర్, జాదవ్ ఉమేష్, హరీష్, ముత్యం, సంగీత, రమ్య ఉన్నారు.

క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ

ముథోల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులకు ఆష్టా గ్రామానికి చెందిన లోలం మురళి సోమవారం క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బిజ్జూరు సాయరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ పెరుమాండ్ల కృష్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలగం రామ్మోహన్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేయండి

సిరికొండ , ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన సిరికొండ మండల కేంద్రంలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థుల సౌకర్యార్థం పదవతరగతి పరీక్ష కేంద్రం మంజూరు చేయాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఈవోకువినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమ ంలో సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే ఇమామ్, సిరికొండ మాజి జడ్పీటీసీ కుంరం చంద్రకళ రఘురామ్, మాజీ సర్పంచ్‌లు పెందూర్ అనిల్ కుమార్, ఆత్రం గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కంచం లక్ష్మణ్, పెందూర్ భీంరావ్,శత్రుఘన్, సంతోష్ పటేల్, సుంగు పటేల్, రాజు పటేల్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

ఇంద్రవెల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఓ మహిళతో సహా మరో 10 మందికి గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం, సోమవారం ఉదయం చేటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో ఓ పిచ్చి కుక్క వీధుల వెంట తిరుగుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారిపై వెంట పడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ దాడిలో భీంనగర్ కాలనీకి చెందిన అశ్విని అనే మహిళను తీవ్రంగా గాయాలు కాగా అదే కాలనీకి చెందిన అర్జున్, లక్ష్మణ్ లకు గాయపడ్డారు. అశ్విని మహిళను తొలుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్య నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఆ పిచ్చి కుక్కను కర్రలతో కొట్టి హతమార్చారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వన మహోత్సవం లక్ష్యం చేరుకోవాలి

బోథ్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పలదరి గ్రామంలో నాటిన మొక్కలను ఎంపీడీవో రమేష్, ఎపిఓ జగదేరావు, ఈసీ సుధాకర్‌లతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. వన మహోత్సవ లక్ష్యాలు చేరుకోవాలని నాటిన ప్రతి మొక్కను బ్రతికించాలని సూచించారు. పశువులు మేపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్, టి ఏ శ్యామ్‌లు ఉన్నారు.

శివాలయాలకు పోటెత్తిన మహిళా భక్తులు

భైంసా,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ఆయావార్డుల పరిధిలో గల ఆలయాల్లో శ్రావణ సందడి కొనసాగుతోంది.శ్రావణమాసంలో భాగంగా మూడో సోమవారం మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లి పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా అన్నాబాహుసాఠే జయంతి

తానూర్ , ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోంద్రట్ గ్రామంలో సోమవారం అన్నాబాహుసాఠే 105వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాబాహుసాఠే ఘన నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కారుడు కొత్తూరు శంకర్‌మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పేద మధ్యతరగతి వాళ్ల కోసం , కార్మిక కర్షకుల కోసం కృషి చేసినటువంటి నాయకుడు సాఠే అని కొనియాడారు. ఈకార్యక్రమంలో నాయకులు ల్మణ్, మాజీ సర్పంచ్ కేశవ్, నాగేందర్‌పటేల్, మోహనాజీ, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాయక్‌వాడ్ గంగాధర్, చంద్రబాహన్, గణపతి, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు నందు, సాయి చంద్, గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటా దేశభక్తిని చాటాలి

ఇంద్రవెల్లి,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటింటా జాతీయ జెండా ఎగుర వేసి దేశభక్తి చాటాలని బీజేపీ ఖానాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ ఆరేల్లి రాజలింగం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ, మాజీ ఎంపిటిసి కోవా రాజేశ్వర్, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపిక్ సింగ్ శేకవత్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేవపూజ్ మారుతి, ప్రధాన కార్యదర్శి కనక హనుమంతు, ఉపాధ్యక్షులు ముండే రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బలమైన సంఘాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ను కొంత మంది స్వార్థపరులు బలమైన సంఘంను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అసోసి యేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీమ్‌రావు వాగ్మారే, దాదా సాహెబ్ జబాడే ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఎన్నికలు జరిగినట్లు ప్రకటనలు వచ్చాయని, బైలా ప్రకారం జరగలేదన్నారు. ఎన్నికలు ఎప్పు డు నిర్వహిస్తామో త్వరలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి తేదీల ను ప్రకటిస్తామన్నారు. గత సంవత్సరం లాగానే ఎన్నికల కమిటీ, అడ హక్ కమిటీ లు అత్యవసర సమావేశం నిర్వహించడం జరుగుతుం దన్నారు.

వీల్ చైర్ విరాళం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కొలిపురకు చెందిన శ్రీపాద నరేందర్ తన తండ్రి శ్రీపాద లక్ష్మణ్ జ్ఞాపకార్థం రిమ్స్ ఆస్పత్రికి వీల్ చైర్‌ను విరాళంగా అందించారు. రోగుల సౌకర్యం కోసం వీల్ చైర్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డాక్టర్ సౌరభ్ పాల్గొన్నారు.

డీజే పెట్టినందుకు పెళ్లి కొడుకుపై కేసు నమోదు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా డీజే పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగించి రాకపోకలకు ఆటంకం కల్పించినందుకు పెళ్లి కొడుకుపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఎస్సై వి. విష్ణు ప్రకాష్ తెలిపారు. ఆదివారం భాగ్యనగర్ కాలనీకి చెందిన పెళ్లి కొడుకు లాడే సందీప్ పెళ్లి అనంతరం రోడ్డు బ్లాక్ చేసి, ప్రజాశాంతికి భంగం చేయడంతో పాటు రాకపోకలకు ఆటంకం కల్పించారు. రాత్రి డయల్ 100 కాల్ రావడంతో అక్కడికి చేరకున్న పోలీసులు ఎంప్లిఫైర్, రెండు బాక్సులు స్వాధీనం చేసుకొని పెళ్లి కొడుకుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బయో మాఫియా బరితెగింపు

(5వ పేజీ తరువాయి...)

వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాలం చెల్లిన పురుగు మందులను కూడా అంటగడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో బయో మందుల వ్యాపారులు సిండికేటు అవుతు తమదందాకు ఎవరూ అడ్డురాకుండా జాగ్రత్త పడుతున్నారు. అడపదడపగా అధికారులు తనిఖీలుచేస్తున్న ఎంతో కొంత ముట్టచెబుతు సైలెంట్ చేస్తున్నారు. బయో మందులపై రైతులుల్లో ఎన్నో అనుమానాలు, అపోహాలు ఉన్నా అధికారులు కనీసస్థాయిలోనూ అవగాహన కల్పించడం లేదంటున్నారు.

రథాల గుడిలో నేడు ప్రత్యేక పూజలు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురిలో గల చారిత్రక రథాల గుడిలో అంగారక సంటకహర చవితి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అనువంశిక అర్చకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో కొలువుదీరిన అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం, సహస్ర మోదక గణపతి హోమం, సహస్ర దూర్వతో విశిష్ట అర్చన ఉంటాయని చెప్పారు.

రాధా మనోహర్‌దాస్ రాక...

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధార్మిక కార్యక్రమాలతో పేరొందిన అభయ్ హిందూసేన వ్యవస్థాపకుడు రాధామనోహర్‌దాస్ ఆధ్వర్యంలో రథాల గుడి ప్రాంగణంలోనే వేణుగోపాల స్వామి ఆలయం పక్కన గల హాల్‌లో సాయంత్రం 4:30 గంటలకు ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. రానున్న కృష్ణాష్టమి నేపథ్యంలో ఈ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సూపరిండెంట్ ఇంజనీర్‌కి సన్మానం

నిర్మల్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతిపై నూతనంగా సూపరిండెంట్ ఇంజనీర్ ఇరిగేషన్ సర్కిల్ నిర్మల్‌లో పదవి బాధ్యతలు స్వీకరించిన బి. వెంకట రాజేంద్ర ప్రసాద్‌ను సోమవారం టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలిపినట్లు జిల్లా అధ్యక్షుడు వెలమల ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ జవాదుస్సేన్, జాయింట్ సెక్రటరీ ఎస్. మోహన్ రెడ్డి, నిర్మల్ అర్బన్ యూనిట్ కోశాధికారి టి. శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అజార్ హుస్సేన్, సంఘ నాయకులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల విభాగం

కుంటాల, ఆగస్టు, 11 : (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేసిందని ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో వనజ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుండి పలు సమస్యలతో కూడిన ఫిర్యాదులను వారు స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విక్రమ్, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్ పలు శాఖల అధికారులు ఉన్నారు.

కొత్త పట్టాదారులకు రైతు బీమా భరోసా

- గొల్లమాడ రైతు వేదికలో దరఖాస్తుల స్వీకరణ

నర్సాపూర్(జి)/మావల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లమాడ రైతు వేదికలో సోమవారం రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కొత్తగా పట్టాదారు పాస్ బుక్స్ పొందిన 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రైతు బీమా పథకం ద్వారా రైతు కుటుంబాలకు భద్రత కల్పించే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి చంద్యాల గణేష్, నర్సాపూర్(జి) మండల వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రైతులకు పథకం ప్రాముఖ్యతను వివరించి, దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహకారాన్ని అందించారు. అకాల మరణం సంభవించినప్పుడు రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. మావల రైతులు బీమా చేయించుకోవాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

13లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

బజార్‌హత్నూర్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): జూన్ 5 వరకు కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకం పొంది, ఇప్పటి వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకొని వారు ఆగస్టు 13లోగా దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మహమ్మద్, విస్తరణ అధికారి క్రిష్ణపాల్‌లు తెలిపారు. రైతులు మార్పులు చేర్పులకు లేదా నామిని చనిపోతే మార్పులకు ఈ నెల 12లోగా దరఖాస్తు సమర్పించాలన్నారు. 18పైబడి 59ఏళ్ల లోపు వారు మాత్రమే బీమాకు అర్హులని తెలియజేశారు. రైతుబీమా ఫాం, రైతుపట్టాదారు పాస్ పుస్తకం, తహసీల్దార్లు డిజిటల్ సంతకం అయిన ధృవపత్రం, రైతుఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు అవసరమని దరఖాస్తుకు జత చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పి మాంసం పట్టివేత

● వేటగాళ్లు పరార్ ● ఆరు బైకులు స్వాధీనం

ముథోల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలం విట్టోలి తండా గ్రామసమీపంలో సోమవారం సాయంత్రం వేటగాళ్లు దుప్పిని వేటాడి మాంసం కోసి పాళ్లు వేస్తుండగా ఫారెస్ట్ అధికారులు వారిని పట్టుకునే లోపు పరారయ్యారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం విట్టోలి తాండ గ్రామం పక్కన గల పొలాల్లో దుప్పిని కోసి పాళ్లు వేస్తున్న సమాచారం మేరకు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లగా వేటగాళ్లు పారిపోయారు. అక్కడ ఉన్న దుప్పి మాంసంను, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు. దుప్పిని వేటాడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టేది లేదని వారిని పట్టుకుంటామని సెక్షన్ ఆఫీసర్ పేర్కొన్నారు.

దేశీదారు పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూలర్ మండలం భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్ 24,000 విలువ కల్గిన 530 దేశిదారు మృదం సీసాలను మహరాష్ట్ర నుండి మెటారు సైకిల్ పై తీసుకువస్తుండగా కోరాటా గ్రామశివారు ప్రాంతంలో పట్టుకున్నట్టు అబ్కారి అధికారుల తెలిపారు. తమ రాకను గమనించి దేశిదారు మద్యంను, మోటారు సైకిల్‌ను వ దిలి పారి పోయారని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రెండ్ల విజేందర్ తెలిపారు. త్వరలోనే నిందితున్ని పట్టుకొని జైలుకు తరలిస్తామని అన్నారు.ఎవరైనా దేశీదారు రవాణా, విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది తానాజీ, ధన్‌రాజ్, హన్మాంతు పాల్గొన్నారు.

బూరుగుపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

మామడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి రాజరాజేశ్వర స్వామి శివాలయంలో శ్రావణ మాసం సందర్భంగా మూడవ సోమవారం రోజున నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీహరి రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో బాగుండాలని రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరవింద్, నాయకులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో దర్శనం చేసుకున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు

రిజర్వేషన్‌లే ఆలస్యం

- కథన రంగంలో అభ్యర్థులు రెడీ
- ఎమ్మెల్యేల ఆశీస్సులు ఎవరికో!

భీంపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటమే ఆలస్యంగా అన్ని అస్త్రశస్త్రాలతో అభ్యర్థులు రెడీ అవుతున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వారే విజేతలుగా నిలువబోతున్నారు. నలుగురు కలిసి చోట ఎన్నికల మాట మండలంలో నలుగురు కలిసిన చోట ఎన్నికల మాటే వినిపిస్తోంది. కాగా భీంపూర్ మండలం ఏడు ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ అభ్యర్థులకు ఎన్నికలు జరుగబోతున్నాయి. జడ్పీటీసీ కోసం కాంగ్రెస్ బీజేపీ, బీఆర్ఎస్ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు రణరంగంలోకి నిలువబోతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ ఆదివాసీ నాయకుడు అన్నూ పటేల్, దాసరి రమేష్, కళ్ళం శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ గడ్డం లస్మన్న, తాజా మాజీ ఎంపీపీ కుడ్మేత సంతోష్, ప్రముఖ న్యాయవాది కేమశ్రీకాంత్, గుర్ల నరేందర్ యాదవ్, బక్కి కపిల్ యాదవ్, బీజేపీ నుంచి మండల అధ్యక్షుడు అంకం అశోక్, మాజీ ఎంపీటీసీ రెడ్డి రమేష్, సోమేష్ బరిలో నిలువబోతున్నారు. అయితే బోథ్ నియోజవర్గ ఎమ్మెల్యే ఆశీస్సులు ఎవరికి ఉంటాయో వారే విజయం సాధిస్తారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే అయినందున భీంపూర్ మండలంలో ఆయనకు మంచి పట్టు ఉందని, ఆశావహులు కూడా ఎమ్మెల్యే ఆశీస్సులు పొందేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఇప్పటి నుంచే గ్రామాల్లోకి వెళ్లి తాను జడ్పీటీసీ బరిలో ఉంటానంటూ ప్రజలను కలుస్తూ ఆశీస్సులు తీసుకుంటున్నారు.

రైతు బీమాకు మరో రెండు రోజులే గడువు

పెంబి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకం అమలు కోసం ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని పెంబి మండల వ్యవసాయ అధికారి నవీన్ నాయక్ అన్నారు. 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్యలో జన్మించి ఈ సంవత్సరం జూన్ 5వ తేదీ నాటికి పాస్ పుస్తకం పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు బీమాకు ఈ నెల 14తో గడువు ముగుస్తున్నందున అంతకుముందే కొత్త పట్టాదారులను నమో దు చేసేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. జూన్ 5వ తేదీ లోపల కొత్తగా భూమి పట్టాలు పొందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో ఆగస్టు 13 తరువాత ఎట్టి పరిస్థితుల్లోను రైతు బీమా నమోదు చేయడం వీలు కాదన్నారు.

ఒక్క రూపాయితో బీఎస్ఎన్ఎల్ సేవలు

- రోజుకు 2 జీబీ డేటా.. 30 రోజుల వ్యాలిడిటీ
- బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ఆఫర్
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మరో 200 కొత్త టవర్లతో సేవలు

ముథోల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సబ్స్క్రైబర్ల కోసం పరిమిత కాలానికి కొతకత ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ను ప్రారంభించింది. 'ఫ్రీడమ్ ఆఫర్' కింద 'ఆజాది కా ప్లాన్' పేరుతో లాంచ్ చేసిన ఈ ప్లాన్ ద్వారా కస్టమర్లు కేవలం రూ. 1తో రోజుకు 2 జీబీ, 4జీబీ డెటా, అపరిమిత కాల్స్, రోజుకు 200ల ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలు లభిస్తాయని బీఎస్ఎన్ఎల్ అధికారులు వెల్లడించారు. అయితే ఈ ఆఫర్ కొత్త కస్టమర్లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ ఫ్రీడమ్ ఆఫర్‌ను పొంది వారికి ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత 4జీ సిమ్ కార్డ్ కూడా సంస్థ ఇవ్వనుంది. ఈ ఆఫర్ ఆగస్టు 1వ తేదీ నుంచి 31 వరకు మాత్రమే ఉంటుంది. ఈ ఆఫర్‌ను పొందడానికి వినియోగదారులు రిటైలర్ లేదా బీఎస్ఎన్ఎల్ సర్వీసెస్ సెంటర్‌లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇటీవల



నిర్మల్ జిల్లా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

బీఎస్ఎన్ఎల్ క్రమంగా సబ్‌స్క్రైబర్లను కోల్పోతోంది. ఈ నేపథ్యంలో తాజా ఆఫర్ ప్రకటించింది. మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇదివరకు బీఎస్ఎన్ఎల్ టవర్లు పాతవి 350



బీఎస్ఎన్ఎల్ టవర్

ఉండగా మరో 200ల కొత్త టవర్లను ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామానికి బీఎస్ఎన్ఎల్ సేవలు అందాలన్న సదుద్దేశంతో వీటిని ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మొత్తం 550 బీఎస్ఎన్ఎల్ టవర్లు మన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో బీ ఎస్ఎన్ఎల్ సేవలు తక్కువ ధరకే అందివ్వాలన్న సదుద్దేశంతో ప్రభుత్వ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ ఈ నిర్ణ యం తీసుకున్నట్లు తెలిపారు. ఒక్క రూపాయితో 30 రోజులు వ్యాలిడిటీ 2జీ, 4జీ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో 5జీ కూడా సేవలు అందించేందుకు చర్యలు జరుగుతున్నట్లు వివరించారు.

వినియోగదారులకు ఉత్తమమైన సేవలు అందించడమే లక్ష్యం
- కే. సతీష్ కుమార్, జేటీవో నిర్మల్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం



వినియోగదారులకు ఉత్తమమైన సేవలను అందించే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ కొత్త పథకాన్ని ఫ్రీడమ్ పేరుతో తీసుకొచ్చింది. ప్రతి పల్లెకు బీఎస్ఎన్ఎల్ సేవలు పారదర్శకంగా అందించాలన్న సదుద్దేశంతోనే ఈ పథకంతో పాటు మరో 200ల టవర్లను సైతం జిల్లాలో ఏర్పాటు చేసింది. వినియోగదారులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

తలమడుగు కళాశాలలో సమస్యల తిష్ఠ

- బర్రెలు, గొర్రెల మందతో గోశాలను తలపిస్తున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యంతో తగ్గిన విద్యార్థుల సంఖ్య
- నిధులున్నా మరమ్మతులు కరువు

తలమడుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 20 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినప్పటికీ కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుంది. కళాశాల ప్రారంభంలో ప్రతి సంవత్సరం దాదాపు 400 మంది విద్యార్థులు కళాశాలలో చదువుకునే వారు కాని ఉన్నతాధికారుల నిర్లక్ష్యం రెండు సంవత్సరాల నుంచి కళాశాలలో విద్యార్థులు చేరెందుకు విముక్తి చూపడం లేదు. కళాశాల ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా కేవలం 50 మంది విద్యార్థులు ఇప్పటి వరకు చేర్పించడం జరిగిందని కళాశాల అధ్యాపకులు ముఖ్యంగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జి పాలనలో కొనసాగుతుంది. ఇంచార్జి ప్రిన్సిపాల్ చుట్టం చూపుల వచ్చి చూడడమే తప్ప కళాశాల గురించి పట్టించుకోవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశాల చుట్టు ప్రహరీ లేకపోవడంతో సెలవు రోజుల్లో పశువుల కాపరులు కళాశాలలోనే గొర్రెలను గొర్రెల మందను కళాశాల వద్దకు తీసుకువచ్చి



తలమడుగు కళాశాలలో బర్రెలు, గొర్రెల మందలతో గోశాలను తలపిస్తున్న దృశ్యం



తలమడుగు కళాశాలలో పగుళ్లు తేలిన మరుగుదొడ్లు

మేపుతున్నారు. దీంతో కళాశాల గోశాలను తలపించేలా కనిపిస్తుందని విద్యార్థులు తల్లిదండ్రులు తెలిపారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులకు విద్యుత్ సౌకర్యం తాగునీటి సౌకర్యం మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పగుళ్ళు తెలి శిథిలవస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా కళాశాలలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటి గదిలోనే విద్యార్థులకు విద్య బోధనలు అందిస్తున్నారు. అంతేకాకుండా ల్యాబ్ సౌక ర్యం ఉన్నప్పటికీ వినియోగంలో లేదు. ఇటీవల జిల్లా స్థాయి అధికారులు, కళాశాలను తనిఖీ చేసినప్పటికీ చీకటి గదిలోనే కళాశాలను తనిఖీ చేశారు. కాగా కళాశాల మరమ్మతుల కోసం ప్రభు త్వం ఇటీవల రూ.15 లక్షలను మంజూరు చేసినప్పటికీ ఇప్పటి వరకు మరమ్మత్తు పనులు చేపట్టకపోవడంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిధులు ఉన్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి తలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను గురించి రెగ్యులర్ ప్రిన్సిపాల్ ఏర్పాటు చేసి కళాశాల చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతు బీమా నమోదుకు సాంకేతిక సమస్యలు

- నేటితో ముగియనున్న సవరణల గడువు
- మొరాయిస్తున్న సర్వర్
- ఆన్‌లైన్ నమోదు సమస్యలతో ఆందోళనలో అన్నదాతలు



భైంసా కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

భైంసా, ఆగస్టు 11 (ఆంధ్రజ్యో తి): అన్నదాత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకానికి సంబంధించి అర్హులైన రైతుల దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియకు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అర్హులైన రైతుల నుంచి రైతు బీమా కోసం దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో వాటి నమోదుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం గాను ప్రభుత్వం వెబ్ సైట్‌తో పాటు యాప్‌ను రూపొందించింది. అయితే సోమవారం ఉదయం మొదలుకొని సాయంత్రం 6 గంటల వరకు నమోదు ప్రక్రియకు సంబంధించి వెబ్‌సైట్ సర్వర్ మొరాయింపు కొనసాగింది. అప్పుడప్పుడు కొద్ది మేర వెబ్‌సైట్ తెరుచుకున్నప్పటికి నమోదు ప్రక్రియ నత్తనడకన కొనసాగింది. సాయంత్రం వేళలో యాప్ వినియోగంలోకి వ చ్చినప్పటికి నమోదుకు సమస్యలు తలెత్తాయి. రెండు రకాలుగా నమోదుకు వెసులు బాటు ఉన్నప్పటికి తొలిరోజు నమోదు ప్రక్రియ అంతంత మాత్రంగానే కొనసాగింది.

● స్వల్ప గడువు కేటాయింపులతో ఉరుకులు,పరుగులు

అర్హులైన అన్నదాతలు రైతు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం కేవలం మూడు రోజుల మాత్రమే గడువు కేటాయించింది. ఇందు కోసం గాను ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం నుంచి బుధవారం వరకు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, నమోదుకు గడువు విధించింది. ఇక ఇది వరకు దరఖా స్తు చేసుకున్న రైతులు సవరణలు చేపట్టుకునేందుకు గాను రెండు రోజు లు అంటే మంగళవారం వరకు మాత్రమే గడువు కేటాయించింది. దీంతో అర్హులైన రైతులతో పాటు సవరణలు చేపట్టుకునే రైతులు దరఖాస్తులు సమర్పించేందుకు గాను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్దకు ఉరుకులు, పరుగులు చేపట్టారు. ఈ నేపథ్యంలో అన్ని క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద అర్హుల, సవరణల రైతుల జాతర కొనసాగింది.

● ఆందోళనలో రైతులు

రైతు బీమా పథకం కోసం స్వల్ప గడువు కేటాయించిన నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల గడువులో తొలిరోజు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు అంతంత మాత్రంగానే కొనసాగింది. సోమవారం సమయం ముగియడంతో మరో రెండు రోజులు మాత్రమే గడువు మిగిలింది.రెండు రోజుల వ్యవధిలో దరఖాస్తుల నమోదు ఆన్‌లైన్‌లో పూర్తయితేనే దరఖాస్తు చేసుకున్న రైతులు రైతు బీమా పథకానికి అర్హులవుతారు. నమోదు ప్రక్రియకు ప్రతికూలతల మధ్య కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

● దరఖాస్తుల స్వీకరణ, నమోదుకు గడువు పెంచాలి
(డా.కిరణ్ కొమ్రేవార్, బీఆర్ఎస్ నాయకుడు

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అన్నదాతలకు అనుగుణంగా నిర్వహించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకం అమలుపై మీనమేషాలు లెక్కిస్తోంది. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులకు స్వల్ప గడువు కేటాయించడం ఇందుకు ఊతమిస్తోంది. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పదే పదే ప్రకటించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమంపై ఎంత మాత్రం చిత్తశుద్ధి ఉన్న రైతు బీమా దరఖాస్తుల, ఆన్‌లైన్ నమోదు గడువును పెంచాలి. నమోదు ప్రక్రియలోని సాంకేతిక సమస్యలను తొలగింప చేసేందుకు సత్వర చర్యలు చేపట్టాలి.

మొక్కులు చెల్లించగా.. 'కదిలె'ను భక్తజనం

- భారీగా భక్తుల రాక
- భక్తులతో కిక్కిరిసిన లొద్ది



కదిలె పాపహరేశ్వర స్వామి దర్శన భాగ్యం కోసం బారులు తీరిన భక్తులు

దిలావర్‌పూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కదిలె లొద్ది(లోయ) భారీగా వచ్చిన భక్త జనంతో కిక్కిరిసింది. శ్రీ పాపహరేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శ్రావణ మాసం మూడో సోమవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. గోముఖ గుండంలో పవిత్ర స్నానాలు చేసి, స్వామివారి దర్శన భాగ్యం కోసం గంటల తరబడి బారులు తీరారు. అభిషేక పూజలు చేశారు. స్పర్శ దర్శనం కోసం భక్తులు పోటీ పడ్డారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కదిలె లొద్ది కిటకిట లాడింది. స్వామివారి దర్శనం అనంతరం శ్రీ మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి కుంకుమర్చాన చేశారు. పద్దెనిమిది వృక్షాలతో కూడిన మహా వట వృక్షానికి ప్రత్యేక పూజలు చేసి చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ...

శ్రావణ మాసం మూడో సోమవారం స్వామివారి దర్శనం కోసం వచ్చిన వేల మందికి దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కటకం వనమాల, రాజారెడ్డి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం తాజా మాజీ చైర్మన్ వెంకట రావు, మాజీ చైర్మన్ భుజంగ్ రావు, సంబాజీ పటేల్, పాలక వర్గ సభ్యులు రమేష్, సప్పల రవి, మారుతి పటేల్, దుత్తరామ్ పటేల్, సాయినాథ్, జూనియర్ అసిస్టెంట్ మాధవ్ రావు పటేల్, తదితరులు పర్యవేక్షణ చేశారు. స్థానిక కదిలి, మాడెగాం, కుస్లీ గ్రామాలకు చెందిన పాపహరేశ్వ స్వామి సేవా సమితి వాలంటీర్లు భక్తులకు అవసరమైన సేవలందించారు.

పడకేసిన పారిశుధ్యం

- తీవ్రమవుతున్న దోమలు....
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికార గణం
- అస్తవ్యస్తంగా మురికి కాలువలు

తాంసి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం పడకేస్తుంది. మురికి కాలువలు ఎక్కడికక్కడే నిండిపోయాయి. ప్రతీ వారం, పది రోజులకు ఒక సారి మురికి కాలువలను శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. తాంసి మండలంలో చాలా గ్రామాలలో ఇదే సమస్య కనిపిస్తుంది. సాక్షాత్తు మండల కేంద్రమైన తాంసిలో సైతం మురికి కాలువలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక మారుమూల పంచాయతీల్లో పారిశుధ్యం పనులపై పట్టింపు ఎలా ఉంటుందో అర్థమవుతుంది. దీంతో దోమల తీవ్రత పెరిగి వ్యాధులు సోకుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో స్థానిక కార్యదర్శులు గాని ప్రత్యేక అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మండల స్థాయి అధికారులు గ్రామాల్లోకి వెళ్లి తూ తూ మంత్రంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు సైతం వ్యక్తం అవుతున్నాయి. కొన్ని గ్రామపంచాయతీలకు సకాలంలో బిల్లు రాకపోవడం వల్ల కూడా మురికి కాలువలను శుభ్రం చేయ లేక పోతున్నామని, సకాలంలో పనులు జరగడం లేదని కార్యద ర్శులే అంటున్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇకనైనా మురికి కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టాలని కోరుతున్నారు.





మండలంలోని ఆయా గ్రామాలలో అస్తవ్యస్తంగా మారిన మురికి కాల్వలు

● కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న నిధుల కొరత

సర్పంచుల పదవీకాలం ముగిసి ఇంచుమించుగా సంవత్సరం గడిచిపోయింది. గ్రామ పంచాయతీలకు నిధుల కొరత కొట్టొచ్చినట్లు కనిపించడంతో పనులు సకాలంలో జరగడం లేదని చెప్పవచ్చు. పారిశుధ్యం కార్మికులకు సైతం నెలల తరబడి వేతనాలు రావడం లేదు. ఇకనైనా అధికార యంత్రాంగం పనులపై సిద్ధ వహించాలని మండల వాసులు కోరుతున్నారు.

మసీదు వద్ద మురుగు నీరు

- ఆవేదనలో చాక్‌పల్లి గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు

నర్సాపూర్(జి), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మసీదు వద్ద పారిశుద్ధ్య సమస్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతం ఒక సున్నితమైన ప్రదేశం కావడంతో మురికి నీటి సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రార్థనల కోసం వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు అభిప్రాయడుతున్నాయి. మసీ దు పక్కన డ్రైనేజీ కాలువ సరిగ్గా లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా అంటు వ్యాధులు ప్రజబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పవిత్ర ప్రదేశంలో పారిశుద్ధ్య లోపం ఉండడం వల్ల భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



చాక్‌పల్లి మసీదు వద్ద మురుగునీటి మడుగు

కదిలే పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్న ముథోల్ ఎమ్మెల్యే



కదిలిలో పూజలు చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

దిలావర్‌పూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతిఇ) : ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సోమవారం సాయంత్రం కదిలె పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. మొదటిసారి వచ్చిన ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను దేవస్థానం తరుపున జూనియర్ అసిస్టెంట్ మాధవ్ రావు పటేల్, తాజా మాజీ చైర్మన్ వెంకట్ రావు, డైరెక్టర్ రమేష్, అర్చకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కదిలిలో పాపహరేశ్వరుడి సన్నిధి తనలో ఆధ్యాత్మిక భావాలను రేకెత్తించిందన్నారు. ప్రకృతి సౌందర్యం ఆకట్టుకుందన్నారు. ఇక్కడి వాతావరణం ప్రశాంతతను కలిగించిందని, ముందు ముందు కూడా ఈ దేవస్థానాన్ని సందర్శిస్తానని అన్నారు. ఎమ్మెల్యే వెంట ముథోల్ నియోజకవర్గం నాయకులు ఉన్నారు.

గిరి గ్రామాల్లో అటకెక్కిన అభివృద్ధి

ఫొటో న్యూస్

ఆదివాసీలు, గిరిజన గ్రామాల వాసులు ఏళ్ళుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతామని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్న మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఇటీవల జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవంలోనూ ఇవే మాటలు పునరావృతం అయినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల నుంచి లోహార, సాలెగూడా మధ్యలో గల రహదారి ఇందుకు నిదర్శనం. గిరి గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయిన రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



లోహార నుంచి సాలెగూడ మధ్య ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి



ఖండాల రోడ్డు

» జిల్లాలో విచ్చలవిడిగా బయో మందుల వాడకం
» మహారాష్ట్ర నుంచి తరలిస్తూ అమ్మేస్తున్న మాఫియా
» నకిలీ పురుగు మందులు బెడదతో నష్టపోతున్న అన్నదాతలు
» కాతాపూత పేరిటా రైతులకు అంటగడుతున్న వ్యాపారులు
» అన్నీ తెలిసినా చర్యలు తీసుకోని వ్యవసాయ శాఖ

బయో మాఫియా బరితెగింపు



మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న బయో మందులను పరిశీలిస్తున్న పోలీసులు



పత్తి పంటకు పురుగు మందులను పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్)

ఆదిలాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 4లక్షల 40 వేల ఎకరాలలో పత్తి సాగవుతోంది. ప్రస్తుతం పంటలో కలుపు, చీడపీడల నివారణకు రైతులు చర్యలు చేపడుతున్నారు. ఈసారి మెట్టపంటలకు అనుకూలమైన వాతావరణమే ఉండడంతో పత్తి ఏపుగా పెరిగి కనిపిస్తోంది. గతంలో జైనథ్, బేల మండలాల్లో నకిలీ బయోమందుల వ్యాపారుల గుట్టురట్టయింది. అయినా అధికారులు చర్యలు తీసుకోకుండానే వదిలేశారు. ఇటీవల మహారాష్ట్ర నుంచి బయోపురుగు మందులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు తనిఖీలుచేసి పట్టుకున్నారు. నిత్యం మహారాష్ట్ర నుంచి జిల్లాకు బయో నకిలీ పురుగు మందులను తరలిస్తున్నా వ్యవసాయశాఖ అధికారుల చర్యలు శూన్యమే. ప్రతీ యేడు నకిలీ బయో పురుగు మందుల వ్యవహారం వెలుగుచూస్తున్నా వ్యవసాయ శాఖాధికారులు తేలికగానే తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో బయో పురుగు మందుల వ్యాపారం జోరుగా సాగుతోంది. అమాయక రైతులకు అంటగడుతూ అందినకాడికి వ్యాపారులు దండుకుంటున్నారు. ప్రతియేటా వానాకాల సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద తప్పడంలేదు. దీనికి తోడు పత్తి పంట ఎదుగుదల, కాతా పూత పేరిటా బయో పురుగు మందులను విక్రయిస్తున్నారు.

ఇచ్చిందే మందు చెప్పిందే ధర

బయో మందులను విక్రయిస్తూ పలువురు వ్యాపారులు బరితెగిస్తున్నారు. ఆ నకిలీ మందులను అమాయక రైతులకు అంటగడుతూ దండుకుంటున్నారు. సరిహద్దు మండలాల్లో వ్యాపారులు ఇచ్చిందే మందు.. చెప్పిందే ధరగా సాగుతోంది. వ్యాపారులే స్థానికంగా నకిలీ బయో మందులను తయారుచేస్తూ అధిక ధరలను నిర్ణయిస్తూ అమ్మేసుకుంటున్నారు. ధరల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. 100 ఎంఎల్ బయో మందులను రూ.600 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖాధికారుల పత్తాలేకుండా పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పంటలను ఆశిస్తున్న తెగుళ్లకు ఏ మందును పిచికారీ చేయాలో తెలియక నష్టపోతున్నారు. కిందిస్థాయి సిబ్బందిపై జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. కొన్ని గ్రామాల్లోనైతే ఇప్పటికీ వ్యవసాయ శాఖాధికారి ఎవరో కూడా తెలియని పరిస్థితి కన్పిస్తోంది.

నమ్మబలుకుతున్న వ్యాపారులు

బయో మందులను పిచికారీ చేయడంతో పంట ఏపుగా పెరిగి పూతకాత సక్రమంగా వస్తోందని వ్యాపారులు నమ్మబలుకుతు పురుగు మందులను విక్రయిస్తున్నారు. పూతకాత సంగతి దేవుడెరుగు గాని పురుగు చావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు, నాణ్యత పరీక్షలు చేయకుండానే బయో మందులను వ్యాపారులు రహస్యంగా దిగుమతి చేసుకుంటూ విక్రయిస్తున్నారు. ప్రధానంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు తదితర ప్రాంతాల నుంచి నాసిరకం బయో పురుగు మందులను తీసుకొచ్చి జిల్లాలో అడ్డగోలుగా విక్రయిస్తున్నారు. అధిక లాభాలు రావడంతో రసాయనమందులను పక్కన పెట్టి బయో మందులను విక్రయించేందుకే (మిగతా 6వ పేజీలో)

మహారాష్ట్ర నుంచి తరలిస్తే చర్యలు తీసుకుంటాం..

• శ్రీధర్‌స్వామి
(వ్యవసాయ శాఖాధికారి,ఆదిలాబాద్)

నకిలీ బయో మందులను మహారాష్ట్ర నుంచి తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా ఎలాంటి క్రిమి సంహారక పురుగు మందులను విక్రయించొద్దు. ఇటీవల మహారాష్ట్ర నుంచి తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని సమాచారం ఇచ్చారు. దీనిపై విచారణ జరుపుతున్నాం. బయో మందులపై రైతులకు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా బయో పురుగు మందులను విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులు ధృవీకరించిన బయో మందులను మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది.

కవ్వాల్ టైగర్‌జోన్‌లో భారీ వాహనాలపై

ఆంక్షల ఎత్తివేత

» ఉత్తర్వులను జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
» ఫలించినా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ప్రయత్నాలు

ఆదిలాబాద్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కవ్వాల్ టైగర్‌జోన్‌లో భారీవాహనాలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గత కొన్నేళ్లుగా అటవీశాఖ విధించే కఠినమైన ఆంక్షలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పలుమార్లు రాష్ట్ర అటవీశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిని పరిశీలించిన బోర్డు సభ్యులు 10 టన్నుల కంటే ఎక్కువ బరువున్న భారీ వాహనాలకు ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సడలింపు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉన్న తపాల్‌పూర్, ఇందన్‌పల్లి,కొత్తగూడెం, పాండ్వపూర్, చెక్‌పోస్టుల వద్ద చెల్లించాల్సిన వాహన రుసుములను వెల్లడించారు. భారీ వాహనాలకు రూ.150, జీపు, కారు వాహనాలకు రూ.50 రుసుముగా చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే వన్యప్రాణులకు హాని కలిగించకుండా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అటవీశాఖ అధికారులు అన్నిరకాల చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు సడలించడంపై ఎమ్మెల్యే వెడ్మబొజ్జు హర్షం వ్యక్తం చేశారు. ఇకనైనా అటవీశాఖ అధికారులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించారు.

కమలం గూటికి బీఆర్ఎస్ నేత పండ్ల శీను?

» ఎమ్మెల్యే పాయలశంకర్‌తో మంతనాలు



బీఆర్ఎస్ నేత పండ్ల శీను

ఆదిలాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కారు దిగి కమలం గూటికి చేరేందుకు పట్టణ బీఆర్ఎస్ నేత పండ్ల శీను సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే పాయల శంకర్‌తో మంతనాలు జరిపినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. గత కొద్దిరోజులుగా మాజీ మంత్రి జోగురామన్నతో పాటు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటు వస్తున్న పండ్ల శీను త్వరలోనే బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీ ముఖ్యనేతల సమావేశానికి పండ్ల శీను డుమ్మా కొట్టినట్లు తెలిసింది. పట్టణంలోని కొలిపురకాలనీ కౌన్సిలర్‌కు సమీప బంధువైన ఆయన ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తు వస్తున్నారు. గత కొంతకాలంగా పార్టీలో అసంతృప్తితో పండ్లశీను బీఆర్ ఎస్‌తో ఇక తెగ తెంపులు చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సమస్యలను పరిష్కరించండి

» ఎస్పీకి విన్నవించిన ఫిర్యాదుదారులు

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదుదారులు ఎస్పీ అఖిల్ మహాజన్ విన్నవించారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. 43మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించి వాటిని పరిష్కరించాలని కోరారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. ఎటువంటి సమాచారం అందించాలన్నా... వాట్సాప్ ద్వారా 8712659973 నెంబర్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్‌లపై కేంద్రం వైఖరి సరికాదు'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును కేంద్రప్రభుత్వం ఆమోదించకపోవడం సరికాదని సీపీఎం పార్టీ నేతలు పేర్కొన్నారు. కేంద్రం తీరును ఖండిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీ రిజర్వేషన్‌ల పట్ల బీజేపీ వ్యతిరేకతతో ఉందని, అదే పార్టీ అధికారంలో ఉన్న ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో ఆమోదం తెలిపి తెలంగాణలో మాత్రం ఈ అంశాన్ని విస్మరిస్తోందని మండిపడ్డారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంకరాఘవులు, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు దత్తాత్రి, జిల్లానాయకులు మంజుల, తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం సరికాదని ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు అన్నారు. సమస్యల సాధనే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మధ్యాహ్నభోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని యూనియన్ నేత కుంటాల రాములు డిమాండ్ చేశారు.

బాధితురాలికి న్యాయం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలో ఓ 78 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం జరిగిన ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని గాండ్ల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందించారు. ఘటనకు పాల్పడిన వ్యక్తిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, చందు ఉన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరై నియోజకవర్గానికి చెందిన 132 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

» కలెక్టర్ రాజర్షి షా



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్



విద్యార్థినికి మాత్రలు వేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందే వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను విని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. 78 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు వినతులపై స్పందించి వాటికి త్వరితగతిన పరిష్కారమార్గం చూపాలని ఆదేశించారు. రాఖీ పండగను పురస్కరించుకుని అదనపు కలెక్టర్ శ్యామలదేవితోపాటు పలువురు చిన్నారులు కలెక్టర్‌కు రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి రాఖీలు కట్టారు. పలువురు చిన్నారులు సైతం కలెక్టర్ కు రాఖీలు కట్టి అభిమానాన్ని చాటారు.

సోయా విత్తనాలు మొలకెత్తలేదని..

సోయా విత్తనాలు మొలకేత్తక తీవ్ర ఆందోళన చెందుతూ రుయ్యాది గ్రామానికి చెందిన గోనెల సుశీల కలెక్టర్‌కు వినతి సమర్పించారు. విత్తనాలు తీసుకున్న రశీదులు తన వద్ద ఉన్నాయని, సంబంధిత అధికారులను కలిసినా న్యాయం జరగలేదని వాపోయారు.

స్త్రీనిధి రుణాలు చెల్లించినా ఖాతాలో జమ చేయలేదని..

తలమడుగు మండలం ఖోడద్ గ్రమనిక్కి చెందిన సరోజినీ దేవి గ్రామా సమాఖ్య మహాత్మా గాంధీ గ్రామా సంఘం సభ్యులు స్త్రీ నిధి ద్వార ఋణం తీసుకుని మూడేళ్లలో తిరిగి చెల్లించినా ఆ నగదును ఖాతాలో జమ చేయలేదని, తమకు న్యాయం చేయాలని సంఘం సభ్యులు లక్ష్మి, రేణుక, రమణి, జ్యోతి కలెక్టర్‌ను కోరారు.

విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నులిపురుగులు ఎలా వ్యాప్తి చెందుతాయి.. వాటివల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు డెమో ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల వయసున్న ప్రతీ ఒక్కరికి నులిపురుగుల నిర్మూలనకు వైద్యఆరోగ్యశాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాల ద్వార అల్బెండజోల్ మాత్రలను వేయించడం జరుగుతుందన్నారు. పిల్లలలో నులిపురుగులు ఉండడం వల్ల వారిలో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటి వల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతారని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు అందుబాటులో ఉన్నాయని, పిల్లలందరికీ కేంద్రాలలోనే మాత్రలు వేయాలని సూచించారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు 2,06,127 మంది పిల్లలు ఉన్నారన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజనల్ కోఆర్డినేటర్లను కార్యక్రమంలో భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు వేయాలని, ఏడాది నుంచి రెండేళ్ల వారికి సగం మాత్ర, రెండేళ్లలు, ఆపై 19ఏళ్ల వారికి ఒక పూర్తి మాత్ర వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి నరేందర్ రాథోడ్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షిషా సమీక్షించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో అధికారులను పలు సూచనలు చేశారు. ఆయా శాఖలకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథికి పోలిసు గౌరవ వందనం, పోలీసు బందోబస్తుతోపాటు. విద్యుత్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలకు తగు ఏర్పాట్లు చేయాలని, అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తులు చేసుకోండి

» రాష్ట్ర కిసాన్‌సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా కోసం అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర కిసాన్‌సెల్ ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18ఏళ్ల నుంచి 59ఏళ్ల వయస్సున్న రైతులు అర్హులని పేర్కొన్నారు. జూలై5 వరకు పట్టాపాస్‌బుక్‌ను పొందినవారు అర్హులని, రైతు బీమా దరఖాస్తు చేసుకున్న రైతులు ఏదైనా తప్పిదాలు జరిగితే మండల వ్యవసాయ శాఖాధికారిని సంప్రదించాలని తెలిపారు. పట్టాపాస్‌బుక్, ఆధార్, నామినీ ఆధార్, జిరాక్స్ పత్రాలను వ్యవసాయ అధికారులకు అందించాలని పేర్కొన్నారు.

బాధితులకు మాజీ ఎంపీపీ పరామర్శ



చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న దృశ్యం

బోథ్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గ్యాస్ లీక్ అయిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యంగా ఉండాలని ఆందోళన చెందవద్దని సూచించారు. రిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వీరి వెంట మాజీ సర్పంచులు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్ ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటాలు



మహాసభలో మాట్లాడుతున్న పద్మ

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలపై జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మె చరిత్రలో నిలిచిపోయే స్థాయిలో జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో సీపీఐ 26వ జిల్లా మహాసభలను సోమవారం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల మరణించిన పార్టీ నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలను రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక సమ్మె విజయవంతంగా జరిగిందని, ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో సైతం కబరబచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి కలవేణ శంకర్, నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్. విలాస్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నళినిరెడ్డి, అమీనా, దేవేందర్, దేవిదాస్, రమేష్, కుంటాల రాములు, మెస్రం భాస్కర్, గజేంగుల రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలి

» ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



నమునా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన బొజ్జుపటేల్

ఉట్నూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మించిన నమునా ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలో మొదటి, రెండవ విడతలలో 659 గృహాలు మంజూరు చేయడం జరిగిందని, ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నందున లబ్ధిదారులు వెంటనే పనులు పూర్తి చేసుకుని బిల్లులు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇసుక అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సామప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ సెల్ జిల్లాఅధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, నాయకులు అజీముద్దిన్, దాసండ్ల ప్రభాకర్, అన్సారి, నిస్సార్, ఏకేఆర్, లింగన్న, బిరుదుల లాజర్, సుశీల్, కోడిప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పండ్ల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు అలసట రాకూడదన్న ఉద్దేశంతో భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఆర్టీసీ ఎం.డీ సజ్జనార్ సూచనల మేరకు భోజనంతో పాటు అరటి పండ్లను అందించారు. సోమవారం సైతం రద్దీ విపరీతంగా ఉండడంతో విధులు నిర్వహిస్తున్న వారికి పండ్ల రసం, అరటి పండ్లను అందజేశారు. డిప్యూటీ ఆర్ఎం శ్రీహర్ష, డీఎం ప్రతిమ రెడ్డి బస్ స్టాండ్‌లో పరిస్థితులను ఎప్పటికపుడు సమీక్షించారు.

యూనివర్సిటీ ఆవశ్యకతపై అవగాహన

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో సోమవారం ఆదిలాబాద్ యూనివర్సిటీ సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. జిల్లాకు యూనివర్సిటీ ఆవశ్యకత గురించి విస్తృత అవగాహన కల్పించారు. స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్య అందాలంటే యూనివర్సిటీ తప్పనిసరని, ఆ దిశగా ప్రభుత్వాలు దృష్టి సారించాలని సాధన సమితి కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ తొగిరి భాస్కర్, సభ్యులు ఎల్మ శ్రీకాంత్ రెడ్డి, అఫ్సర్ ఖాన్, ప్రఫుల్ వజే, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

» బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి: మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి

బోథ్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని, కొందరు కావాలనే చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవులు పేర్కొన్నారు. ఆదివారం సోనాల మండల కేంద్రంలో యూరియా ఉన్నప్పటికీ కావాలని కొందరు యూరియా కొరత ఉందంటూ ధర్నాలకు దిగడం జరిగిందన్నారు. కేవలం బీఆర్ఎస్ నాయకుల ప్రోత్సాహంతో ధర్నాకు దిగారని పేర్కొన్నారు. ధర్నా అనంతరం 'యూరియా ఇస్తాం.. రండి అని పిలిచినా రాలేరన్నారు. చిల్లర రాజకీయాలు మానకపోతే రైతులతో బుద్ధి చెప్తారని వారు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్ ఎల్.పోశెట్టి ఆత్మ డైరెక్టర్లు, గంగారెడ్డి భోజన, రమేష్‌రెడ్డి, సంజీవ్, చింతలపూడి మాజీ సర్పంచ్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఆత్మ చైర్మన్‌లు